సాక్షి కర్నూలు

శుక్రవారం, 28, జూలై, 2023



1,620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి గురువారం సాయంత్రం సమయానికి 1,620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం జలాశయంలో 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు

పెద్దకడబూరు: చిన్న సరిగెత్తు వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లో కొలువుదీరిన పీర్లను ఊరేగించారు. ప్రత్యేక చదివింపులు చేపట్టారు.



స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ స్పోర్ట్స్ మీట్ గురువారం ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 312 నవోదయ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. 8లో

న్యూస్‌రీల్

రాఘవుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి తీసుకుని వచ్చిన పూలతో మూలబృందవనాన్ని అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. గురువారం రాత్రి ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఉంచి శ్రీ మఠం మాడ వీధుల్లో ఊరేగించారు.

1,800 మందికి టిడ్కో ఇళ్లు



మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్: పట్టణంలో 1,800 మంది పేదలకు టిడ్కో ఇళ్లు కేటాయించామని, వారు ఇళ్లల్లో చేరి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి అన్నారు. గురువారం తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి విన్నపం మేరకు ప్రభుత్వం టిడ్కో ఇళ్లకు రూ.450కే విద్యుత్ కనెక్షన్ ఇస్తోందన్నారు. ఇప్పటివరకు 1,400 ఇళ్లకు కనెక్షన్ ఇచ్చారని చెప్పారు. మిగిలిన వారికి త్వరలోనే ఇవ్వనున్నారని తెలిపారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు ద్వారానే టిడ్కో ఇళ్లకు తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. వీధిలైట్లు, ముళ్లపొదల తొలగింపు తదితర సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. ప్రతి ఇంటికి నెలకు రూ.49 మాత్రమే కరెంట్ బిల్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎవరికైనా ఏదైనా సమస్య ఉంటే నేరుగా తమదృష్టికి తీసుకురావాలని, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు.

నిర్వహణ నిధులు మంజూరు

కర్నూలు సిటీ: జిల్లాలోని స్కూల్ కాంప్లెక్సులు, మండల విద్యా వనరుల కేంద్రాలు, ఏపీ మోడల్ స్కూళ్లు, బాలికల హాస్టళ్లు, కేజీబీవీల నిర్వహణకు నిధులు మంజూరు అయినట్లు సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డాక్టర్ కే వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 151 స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.37,35,000, అలాగే 26 మండల విద్యా వనరుల కేంద్రాలకు రూ.24,70,000, 16 ఏపీ మోడల్ స్కూల్ బాలికల హాస్టళ్లకు, 26 కస్తూర్బా గాంధీ విద్యాలయాల నిర్వహణకు రూ.9,10,000 నిధులు మంజూరు అయినట్లు ఆయన వెల్లడించారు.

స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో స్పోర్ట్స్ కోటాలో టీచింగ్ ఫ్యాకల్టీ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డాక్టర్ కే వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్‌టీ హిందీ, సోషల్‌లలో ఒకటి చొప్పున, పీజీటీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిపై భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వచ్చే నెల 9వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు rvmssakurnool. blogspot.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

సంగీత, నృత్య కోర్సు ప్రయోగ పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంగీతం, నృత్యం తదితర కళల సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల ప్రయోగ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. కర్నూలు ప్రభుత్వ శారద సంగీత, నృత్య కళాశాలలో నిర్వహించి ప్రయోగ పరీక్షల్లో ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల విద్యార్థుల పరీక్షలకు హాజరయ్యారు. కూచిపూడి నృత్యానికి పసుమర్తి శేషుబాబు, సంగీతానికి తబిత కుమారి, డోల్‌కు వెంకట శివయ్య, నాదస్వరానికి కాల్వ వెంకటేశ్వర్లు ఎగ్జామినర్లుగా హాజరయ్యారు. నాలుగు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి సంగీతానికి 17, కూచిపూడి నృత్యానికి 25, నాదస్వరానికి 11, డోలుకు 4, రెండు సంవత్సరాల డిప్లమా కోర్సుకు సంగీతానికి 10, కూచిపూడి నృత్యానికి 8 మొత్తం 75 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ ప్రయోగ పరీక్షలు ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.



కూచిపూడి నృత్య ప్రయోగ పరీక్షలలో విద్యార్థినులు

అపురూప గుర్తింపు!



శిల్ప నైపుణ్యం: ఆళ్లగడ్డ శిల్పులు తయారు చేసిన శివుని విగ్రహం

- ఆళ్లగడ్డ శిల్పాలకు నేషనల్ అవార్డు కోసం ప్రతిపాదనలు
- కర్నూలు జిల్లా చేనేత పట్టు చీరలకు భౌగోళిక గుర్తింపు లభించే అవకాశం
- ఒకటి, రెండు రోజుల్లో ప్రతిపాదనలు పంపనున్న కలెక్టర్
- ఒక జిల్లా–ఒక ఉత్పత్తి జాతీయ అవార్డుల నోడల్ అధికారిగా హరికృష్ణ

ప్రాచీన శిల్ప కళకు అరుదైన గుర్తింపు లభిస్తోంది. ఆళ్లగడ్డ శిల్పుల నైపుణ్యానికి జాతీయ అవార్డు దక్కనుంది. ఇందుకోసం ప్రతిపాదనలు సైతం ఢిల్లీకి చేరాయి. ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద చేనేత కార్మికుల ప్రతిభ కూడా వెలుగులోకి రానుంది. కర్నూలు జిల్లా పట్టుచీరలకు కేంద్ర అవార్డు కోసం కలెక్టర్ ప్రతిపాదనలు పంపనున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉత్పత్తవుతున్న ఆళ్లగడ్డ శిల్పాలకు, చేనేత పట్టు చీరలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించే సూచనలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఒక జిల్లాకు.. ఒక ఉత్పత్తి కింద అపురూపమైన చేతి వృత్తులకు జాతీయ స్థాయిలో అవార్డులు ప్రకటించనుంది. ఇందుకోసం ఒక్కో జిల్లా నుంచి ఒక్కో ఉత్పత్తిపై ప్రతిపాదనలు పంపాలని కేంద్రం ఆదేశించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అవార్డుల కోసం ప్రతిపాదనలు పంపడానికి చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు హరికృష్ణను నోడల్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈయన ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి కింద కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతారు. అవార్డులకు ఎంపికైతే ఆయా జిల్లా కలెక్టర్లు భారత ప్రధాని నరేంద్రమోదీ ద్వారా జాతీయ స్థాయి పురస్కారాలు అందుకుంటారు. అవార్డులకు ఎంపికై తే కర్నూలు జిల్లాలో తయారవుతున్న చేనేత పట్టు చీరలు, నంద్యాల జిల్లాలో తయారవుతున్న శిల్పాలకు భౌగోళిక గుర్తింపు కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

చేనేత కార్మికుల నైపుణ్యం

కర్నూలు జిల్లాలోని కోడుమూరు, ఆదోని, ఎమ్మిగనూరు, కృష్ణగిరి, నందవరం తదితర మండలాల్లో చేనేత మగ్గాలపై 2,200 మంది పట్టుచీరలు నేస్తున్నారు. ఒక్కొక్కరు సగటున వారానికి రెండు ప్రకారం 4,400 పట్టుచీరలు.. నెలకు 17,600 ఉత్పత్తి చేస్తున్నారు. చీర ధర రూ.5 వేలు ప్రకారం లెక్కకట్టినా వీటి విలువ రూ.8.80 కోట్లు ఉంటుంది. ఈ ప్రకారం ఏడాదికి రూ.100 కోట్ల విలువైన పట్టుచీరలు ఉత్పత్తి చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఉత్పత్తవుతున్న పట్టుచీరలను గద్వాల పట్టుచీరల పేరుతో మార్కెటింగ్ చేస్తున్నారు. విదేశాల్లో వీటికి విపరీతమైన డిమాండ్ ఉంది. ప్రవాసాంధ్రులు, ప్రవాస భారతీయుల మహిళలు వీటిపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. జిల్లా యంత్రాంగం ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద జాతీయ స్థాయి అవార్డుకు చేనేత పట్టుచీరలను ఎంపిక చేసింది. జాతీయ స్థాయి అవార్డు వస్తే భౌగోళిక గుర్తింపు కూడా లభించే అవకాశం ఉంది. జిల్లా కలెక్టర్ సృజన ఆధ్వర్యంలో నోడల్ అధికారి హరికృష్ణ, చేనేత జౌళి శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో జాతీయ స్థాయి అవార్డుల కోసం ప్రతిపాదనలను కలెక్టర్ ద్వారా పంపనున్నారు.



అందాల కలబోత.. కర్నూలు జిల్లా చేనేత కార్మికులు నేసిన పట్టు చీర



మగ్గంపై అద్భుతం: పట్టు చీరను నేస్తున్న చేనేత కార్మికురాలు

విశేష ప్రాచుర్యం లభిస్తుంది



కర్నూలు జిల్లా చేనేత పట్టు చీరలు ప్రసిద్ధి చెందాయి. ఒక జిల్లా–ఒక ఉత్పత్తి కింద జాతీయ అవార్డు కోసం ప్రతిపాదనలు పంపుతున్నాం. నంద్యాల జిల్లాకు సంబంధించి ఆళ్లగడ్డ రాతి బొమ్మలకు అన్ని చోట్లా గుర్తింపు ఉంది. జాతీయ అవార్డు కోసం కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపాం. ప్రతిపాదనలను కేంద్రం ఆమోదిస్తే ఆయా ఉత్పత్తులకు విశేష ప్రాచుర్యం లభిస్తుంది. భౌగోళిక గుర్తింపు కూడా వచ్చే అవకాశం ఉంది.

– హరికృష్ణ, నోడల్ అధికారి



రాతి బొమ్మల సోయగం

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో తయారు అవుతున్న రాతి బొమ్మలకు ఇప్పటికే జాతీయ స్థాయిలో పేరు ఉంది. ఇక్కడ శిల్పులు తయారు చేసిన బొమ్మలు దేశం నలుమూలలకు ఎగుమతి అవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం యాదగిరి గుట్టలోని దేవతామూర్తుల బొమ్మలు ఆళ్లగడ్డ శిల్పుల చేతుల నుంచి జాలువారినవి కావడం విశేషం. దేశంలోని అనేక గ్రామాల్లో పూజలు అందుకుంటున్న దేవతామూర్తుల విగ్రహాలు ఆళ్లగడ్డ శిల్పులు చెక్కినవే. ఇక్కడ 96 మంది శిల్పులు రాతి బొమ్మలు చెక్కుతున్నారు. ఏడాదికి రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు టర్నోవర్ ఉంటోంది. ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద నంద్యాల జిల్లా నుంచి ఆళ్లగడ్డ రాతి బొమ్మలను జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. ఇప్పటికే నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తరఫున నోడల్ అధికారి, ఉమ్మడి జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ ప్రతిపాదనలు పంపారు.

చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట నాగశ్రీనివాసరావు



విద్యార్థినితో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగశ్రీనివాసరావు

కర్నూలు(అర్బన్): చట్టాలు, ఉచిత న్యాయ సహాయం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆయన గురువారం స్థానిక గిరిజన బాలికల వసతి గృహం, జువైనల్ హోం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌ను అయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థినులకు న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. అలాగే బాలల సంరక్షణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వసతి గృహంలోని సౌకర్యాలు, ఆహార నాణ్యత, పరిశుభ్రత తదితర వాటిని ఆయన పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏఎల్ గుర్రప్ప, వసతి గృహ సంక్షేమాధికారిణి సుప్రజ, వైస్ ప్రిన్సిపాల్ సలోమి తదితరులు పాల్గొన్నారు.

తుంగా పరవళ్లు.. కృష్ణమ్మ పరుగులు



వరద నీటితో తొణకిసలాడుతున్న తుంగభద్ర డ్యాం

- తెరుచుకున్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల గేట్లు
- జూరాల నుంచి వస్తున్న 72 వేల క్యూసెక్కులు నీరు
- నేడు ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీకి నీటి విడుదల

కర్నూలు సిటీ: కొంత ఆలస్యంగానైనా వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతోంది. కృష్ణానది పరుగులు తీస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద నీరు చేరి ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల గేట్లు తెరుచుకున్నాయి. గురువారం సాయంత్రం 6 గంటలకు ఆల్మట్టి నుంచి 1.50 లక్షల క్యూసెక్కులకుపైగా నీటిని నారాయణపూర్‌లోకి విడుదల చేయగా, అక్కడి నుంచి 1.50 లక్షల క్యూసెక్కుల నీరు జూరాలలోకి వదిలారు. జూరాల నుంచి 7 క్రస్టు గేట్ల ద్వారా 27,846 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 34,000 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఈ నీరు శ్రీశైలానికి చేరుతోంది.

54 టీఎంసీలకు చేరుకున్న టీబీ డ్యాం

తుంగభద్ర జలాశయంలో గురువారం సాయంత్ర సమయానికి 54 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 1.21 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డ్యాంలో 30 టీఎంసీలకుపైగా నీరు నిల్వ ఉంటే కాలువలకు నీటిని విడుదల చేయవచ్చు. నీటి సామర్థ్యం 54 టీఎంసీలకు చేరడంతో శుక్రవారం ఉదయం 9 గంటలకు తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్ఎల్‌సీ) దిగువ కాలువ(ఎల్ఎల్‌సీ)కునీరు విడుదల చేయనున్నారు. 105 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ డ్యాం నుంచి హెచ్చెల్సీకి 32 టీఎంసీలు, బైరవానితిప్పకు 4 టీఎంసీలు, ఎల్ఎల్‌సీకి 24 టీఎంసీలు, ఆర్డీఎస్ కుడి కాలువకు 4 టీఎంసీలు, కేసీ కాల్వకు 10 టీఎంసీల నికర జలాల వాటా ఉంది. మొత్తం 74 టీఎంసీల నీరు రాయలసీమ జిల్లాలకు రావాల్సి ఉంది. ఈ ఏడాది నీటి లభ్యత 175 టీఎంసీలకు అంచనా వేసి నీటి కేటాయింపులు చేశారు. ఈ ప్రకారం హెచ్ఎల్‌సీకి 26.828, ఎల్ఎల్‌సీకి 19.811, కర్నూలు–కడప కాలువకు 8.255 టీఎంసీలు కేటాయించారు. ఈ వాటాలతో పాటు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు సాగు నీటిని అందించే ఆర్డీఎస్ కాలువకు 5.374 టీఎంసీల ప్రకారం నీటిని కేటాయింపులు చేశారు.

శ్రీశైలంలో పెరుగుతున్న నీటి మట్టం

ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టుల్లోకి శుక్రవారానికి ఇన్‌ఫ్లో 2 లక్షల క్యూసెక్కులకుపైగా చేరనున్న ట్లు సీడబ్ల్యూసీ(హైదరాబాద్) ఇంజినీర్లు అంచనాలు వేశారు. ఈ నెల 25న నాటికి శ్రీశైలం రిజర్వాయర్‌లో 813.90 అడుగుల నీటిమట్టం, 36.66 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. గురువారం నాటికి 816.20 అడుగుల నీటిమట్టానికి చేరుకుని 39 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పేదలకు ప్రపంచ స్థాయి చదువు

- జిల్లాలో ఇద్దరు విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన
- రూ.15.55 లక్షల మెగా చెక్కును అందజేసిన కలెక్టర్, మేయర్, ఎమ్మెల్యేలు



జగనన్న విదేశీ విద్యా దీవెన మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, డాక్టర్ జే సుధాకర్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): పేదలకు ప్రపంచ స్థాయి చదువు అందించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తోందని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, డాక్టర్ జే.సుధాకర్ అన్నారు. గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి ఎంపికైన విద్యార్థులకు రెండో విడత స్కాలర్‌షిప్ నిధులను బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ప్రజాప్రతినిధులు, విదేశీ విద్యకు ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వీక్షించారు. ఈ సందర్భంగా మేయర్, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. విద్యతోనే పేదరికం అంతమవుతుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలంగా నమ్మి పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలను నాడు–నేడు పథకం కింద వృద్ధిలోకి తెస్తున్నారన్నారు. విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు, బ్యాగ్‌లతోపాటు జగనన్న గోరుముద్ద కింద పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. ప్రతి పాఠశాలలో ఇంగ్లిషు మీడియాన్ని ప్రారంభించారని చెప్పారు. కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం జగనన్న విద్యా, వసతి దీవెన పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రపంచంలోని టాప్–100 యూనివర్సిటీల్లో చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటు కోసం జగనన్న విదేవీ విద్యా దీవెన పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం కింద ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా రూ.1.25 కోట్ల ట్యూషన్ ఫీజును రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా భరిస్తోందన్నారు. ఇతరులకు రూ.కోటి వరకు చెల్లించి వారి ఉన్నత చదువులకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

మెగా చెక్కు అందజేత..

కర్నూలు జిల్లా నుంచి జగనన్న విదేశీ దీవెన పథకానికి ఆస్పరికి చెందిన కుంబాల విక్రమ్, కర్నూలుకు చెందిన షేక్ హ్మాయద్ ఫాజిల్ ఎంపికయ్యారు. వీరికి రూ.15.55 లక్షల మెగా చెక్కును జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు అందజేశారు. అంతకుముందు వర్చువల్‌గా సీఎం వైఎస్ జగన్‌తో కలెక్టర్, కుంబాల విక్రమ్ మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నెదర్లాండ్‌లో చదువుతున్నా



మాది మధ్య తరగతి కుటుంబం. మా తండ్రి కుంబాల రంగస్వామి వ్యవసాయం చేస్తారు. పనులు లేనిసమయంలో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాకు విదేశాల్లో చదవాలని బలమైన కోరిక ఉండేది. అయితే మా తండ్రి ఆర్థిక పరిస్థితి చూసి వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఇంతలోనే జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం గురించి విని దరఖాస్తు చేశా. పీహెచ్‌డీలో మొదటి ర్యాంకు సాధించిన కారణంగా నాకు నెదర్లాండ్‌లోని వేజ్నింజేన్ యూనివర్సిటీ అండ్ రిసెర్చ్‌లో ప్లాంట్ సైన్స్ చదివే అవకాశం వచ్చింది. జగనన్న బటన్ నొక్కగానే రూ.8,77,547 నగదు నా బ్యాంక్ ఖాతాలో పడ్డాయి. అందుకు కృతజ్ఞతలు. విద్య పూర్తవగానే మన దేశంలోనే సేవ చేస్తానని జగనన్నకుమాట ఇచ్చా. నిలబెట్టుకుంటా.

– కుంబాల విక్రమ్

కల సాకారం అయ్యింది



మా నాన్న లారీ ట్రాన్స్‌పోర్టులో కమిషన్ ఏజెంటుగా పనిచేసేవారు. అతి కష్టంమీద రోజువారీగా వచ్చే కమిషన్‌తో నన్ను చదివించారు. దురదృష్టవశాత్తు ఆయన కరోనా బారినపడి చనిపోయారు. ఇక నా చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన పరిస్థితి. ఈ సమయంలో జగనన్న విదేశీ విద్యా దీవెన గురించి తెలుసుకొని దరఖాస్తు చేశా. లండన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్‌లో ఎంఎస్సీ ప్లానింగ్ చదివేందుకు ఎంపికయ్యా. జగనన్న సహకారంతో నా కలను సాకారం అయ్యింది. ఇప్పుడు మా అమ్మ ఖాతాలో రూ.6,77,673 జమయ్యాయి. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– షేక్ మహ్మద్ ఫాజిల్, కర్నూలు

ఆగస్టు 4న ఉద్యోగ మేళా



కరపత్రాలు విడుదల చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆగస్టు 4వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. ఆలూరులోని మంత్రి కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రముఖ కంపెనీలైన హెటిరోడ్రగ్స్, హిల్ మైఫ్యామిలీ, గ్రీన్‌టెక్, అమర్ రాజ్ బ్యాటరీ, ఎన్ లైట్‌కాడ్, టీసీఎల్, అరబిందో ఫార్మా, నవభారత్ ఫర్టిలైజర్స్, ఎల్అండ్టీ, పేటీఎం, ఫ్లిఫ్ కార్డు, వైఎస్‌కే ఇన్ఫో టెక్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఆలూరుకు వచ్చిన నిరుద్యోగులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, ఎంబీఏ, బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి అధికారి వి, క్రాంత్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్ గురువారం తెలిపారు. ఈనెల 31న ఉదయం 6 గంటలకు డిపో నుంచి బయల్దేరే సర్వీసు కాణిపాకం దర్శనం అనంతరం అరుణాచలానికి అదే రోజు రాత్రి చేరుకుంటుందన్నారు. అక్కడ గిరిప్రదక్షిణ, స్వామివారి దర్శనం తర్వాత మరుసటి రోజు సాయంత్రం బయల్దేరి వేలూరులోని స్వర్ణదేవాలయం దర్శనం అనంతరం నంద్యాలకు చేరుకుంటుందన్నారు.

క్లుప్తంగా

వైమానిక దళ రిక్రూట్‌మెంట్‌పై నేడు సదస్సు

కర్నూలు(హాస్పిటల్): భారత వైమానిక దళంలో అగ్నివీర్‌-వాయు ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌పై శుక్రవారం కర్నూలులోని అవుట్‌డోర్‌ స్టేడియంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి పీవీ. రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌/డిప్లమా పూర్తి చేసిన విద్యార్థుల నుంచి ఈ నెల 27 నుంచి వచ్చే నెల 17వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించి దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియ మొదలైన వాటిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హతగల వారు ఈ సదస్సుకు హాజరుకావాలని సూచించారు.

నేడు జూనియర్ కళాశాలల బంద్

కర్నూలు కల్చరల్‌: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో శుక్రవారం జూనియర్‌ కళాశాలలను బంద్‌ చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్‌ బాబ్జీ గౌడ్‌ తెలిపారు. గురువారం ఏబీవీపీ కార్యాలయం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బంద్‌కు అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎర్రిస్వామి, రాష్ట్ర టెక్నికల్‌ కన్వీనర్‌ వెంకటేష్‌, నాయకులు రూపేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 31లోపు రీసర్వే పూర్తి చేయండి

- అధికారులను ఆదేశించిన సీసీఎల్‌ఏ కార్యదర్శి జి. సాయిప్రసాద్‌

కర్నూలు(సెంట్రల్‌): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేను ఆగస్టు 31వ తేదీ లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీసీఎల్‌ఏ కార్యదర్శి జి.సాయిప్రసాద్‌ ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా కలెక్టర్లు, జేసీలతో రీసర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రీసర్వేను నాణ్యతా ప్ర మాణాలు పాటించి రోవర్ల ద్వారా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 3500 రోవర్లు ఉన్నాయని, ఇంకా అవసరమైతే పంపేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. పెండింగ్‌లోని 15 లక్షల రీసర్వే రాళ్లను నాటించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌ డాక్టర్‌ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో ఎస్వీ నాగేశ్వర రావు, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ నాగప్రసన్న, సర్వే ఏడీ రామ్మోహన్‌ పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి పండ్ల వ్యాపారి మృతి

కర్నూలు: కల్లూరు మండలం కొంగనపాడు గ్రామానికి చెందిన తెలుగు పరమేష్‌ (26) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈయన కర్నూలులో పండ్లు కొనుగోలు చేసి తెలంగాణ రాష్ట్రంలోని కొత్తపేట, పెబ్బేరు ప్రాంతాలకు తీసుకెళ్లి వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. రోజులాగే గురువారం కూడా పండ్ల వ్యాపారం ముగించుకుని సాయంత్రం చీకటిపడే సమయంలో అలంపూరు నుంచి కర్నూలుకు పల్సర్‌ వాహనంపై వస్తూ బళ్లారి చౌరస్తాలోని ఫ్లై ఓవర్‌ బ్రిడ్జిపై వాహనం అదుపు తప్పి కింద పడటంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు భార్య రేణుకతో పాటు కొడుకు, కూతురు సంతానం. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్‌ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి వాహనం అదుపు తప్పడం వల్లే మృతిచెందినట్లు అభిప్రాయపడుతున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్‌ పోలీసులు తెలిపారు.

కాలేయం..కలవరం!

- ఏటా పెరుగుతున్న కాలేయ జబ్బు బాధితులు
- జిల్లాలో నాలుగు శాతం మందికి జబ్బు
- అధికంగా హెపటైటిస్‌-బి, సి వైరస్‌ల వ్యాప్తి
- కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉచితంగా చికిత్స
- హెపటైటిస్‌తో జన్మించిన శిశువుకు ఇమ్యూనోగ్లోబిన్స్‌ వ్యాక్సిన్‌
- నేడు వరల్డ్‌ హెపటైటిస్‌ డే



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి ప్రతి సోమ, గురువారాల్లో ఓపీ సేవలు నిర్వహిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను రోజూ చూస్తున్నారు. మంగళ, శుక్రవారాల్లో ఎండోస్కోపి, కొలనోస్కోపి, ఐఆర్‌సీపీ వంటి పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఈ విభాగంలో ఏటా 600 నుంచి 700 వరకు ఓపీ రోగులు, 120 మంది 150 మంది ఇన్‌పేషంట్లు చికిత్స పొందుతున్నారు. ఈ యేడాది కాలేయ జబ్బులకు జనవరిలో 71, ఫిబ్రవరిలో 55, మార్చిలో 69, ఏప్రిల్‌లో 55, మేలో 62, జూన్‌లో 74 మంది చికిత్స పొందారు. నంద్యాల, బనగానపల్లె, ప్యాపిలి, నందికొట్కూరు, కోడుమూరుతో పాటు తెలంగాణా రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లాలోని కొంకల గ్రామం నుంచి అధిక సంఖ్యలో రోగులు చికిత్స కోసం వస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

కర్నూలు(హాస్పిటల్‌): హెపటైటిస్‌ వ్యాధి అంటే సామాన్యులకు తెలియదు. అదే జాండిస్‌ అంటే కొద్దిమందికి తెలుస్తుంది. పసిరికలు అంటేనే సామాన్యులకు సైతం అర్థమవుతుంది. ఇందులోనే పచ్చ పసిరికలు, తెల్లపసిరికలుగా ప్రాచుర్యంలో ఉన్న పదాలు. వైద్య పరిభాషలో పసిరికలను హెపటైటిస్‌ వ్యాధిగా పిలుస్తారు. ఈ వ్యాధికి చాలా మంది నాటు వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. వ్యాధి ముదిరాక వైద్యుల వద్దకు వస్తున్నారు. అప్పటికే కాలేయం దెబ్బతినడంతో వ్యాధి నయం కావడానికి సమయం పడుతోంది. ఒక్కోసారి ప్రాణాలమీదకూ వస్తోంది. బ్లంబర్గ్‌ అనే శాస్త్రవేత్త ఈ వ్యాధిని గుర్తించి వ్యాక్సిన్‌ కనుగొన్నారు. అందుకే ఆయన పుట్టిన రోజు జూలై 28న ఏటా వరల్డ్‌ హెపటైటిస్‌ డేగా నిర్వహించి వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు.

హెపటైటిస్ వ్యాధులు–రకాలు

మనిషి శరీరంలోని కాలేయాన్ని తరచూ వేధించే వైరస్‌లు హెపటైటిస్‌ ఏ, బీ, సీ, ఈ. వీటిలో ఏ, ఈ వాటంతవే తగ్గిపోతాయి. సాధారణ కామెర్లు వీటితో వచ్చేవే. కానీ బీ, సీ వైరస్‌లు ప్రమాదకరమైనవి. ఇవి సమాజంలో 3 నుంచి 4 శాతం మందిని వేధిస్తున్నట్లు వైద్యుల అంచనా. కలుషిత నీరు, ఆహారానికి దూరంగా ఉంటే హెపటైటిస్‌ ఏ, ఈ వైరస్‌లు దరిచేరవు.

హెపటైటిస్‌–బి వైరస్‌

హెపటైటిస్‌–బి వైరస్‌ వచ్చిన వారిలో లక్షణాలేమీ కనిపించవు. కొందరిలో కళ్లు, చర్మం పచ్చబడటం, కొద్దిగా జ్వరం, అలసట వికారం, కడుపునొప్పి, కీళ్లనొప్పుల వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్రాథమిక దశలో పెద్దగా మందులు అవసరం ఉండదు. ఇతర సమస్యలేమీ లేకపోతే పోషకాహారం, విశ్రాంతి తీసుకుంటే చాలు. వాంతులు, తీవ్రమైన నిస్సత్తువ, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలున్న వారికి మాత్రం రక్తనాళం ద్వారా ద్రవాలు ఇవ్వాల్సి ఉంటుంది. దాదాపు 90 శాతం మందిలో వైరస్‌ దానంతటదే తొలగిపోతుంది. కొందరిలో దీర్ఘకాలిక సమస్యగా మారుతుంది. కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారుతుంది. ఇతరులు ఉపయోగించిన సిరంజిలు, బ్లేడ్లు, టూత్‌బ్రష్‌లు వాడే వారికి బి వైరస్‌ సోకుతుంది. దీనికి టీకా అందుబాటులో ఉంది.

హెపటైటిస్‌–సి వైరస్‌

హెపటైటిస్‌–సి వైరస్‌లోనూ తొలిదశలో లక్షణాలేమీ కనిపించవు. ఫ్లూ జ్వరం, అలసట, వికారం, కామెర్ల లక్షణాలు, కీళ్లనొప్పులు, ఆందోళన, కడు పునొప్పి, ఆకలి లేకపోవడం వంటివి ఉంటాయి. ఇది చాలా మందిలో దీర్ఘకాలిక ఇన్‌ఫెక్షన్‌గా మారుతుంది. కొందరిలో ఐదేళ్లలోనే కాలేయ సమస్యగా తలెత్తవచ్చు. కొందరికి కాలేయం గట్టిపడటం వంటి తీవ్ర సమస్యలు తలెత్తటానికి 20 ఏళ్లకు పైగా పట్టే అవకాశం ఉంది. కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారవచ్చు. ఈ వైరస్‌ కూడా రక్తం ద్వారానే వ్యాప్తి చెందుతుంది. కాబట్టి రక్తమార్పిడి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఈ వ్యాధికి చికిత్స కంటే నివారణే ప్రధానం.

కోవిడ్ కంటే ఎక్కువగా కాలేయ జబ్బుల మరణాలు

కాలేయ వ్యాధులతో ఏటా కోవిడ్‌ కంటే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్‌ వెంకటరంగారెడ్డి చెప్పారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ మోహన్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా లివర్‌ జబ్బులతో 13 లక్షల మంది, మన దేశంలో లక్ష మంది మరణిస్తున్నారన్నారు. హెపటైటిస్‌లో బి, సి వైరస్‌లు దీర్ఘకాలిక జబ్బులుగా మారి ప్రాణాంతకమవుతాయన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి వచ్చే వారిలో సగం మంది కాలే య జబ్బులతోనే వస్తున్నారన్నారు. వారికి వైద్యం ఖర్చుతో కూడుకున్నదని, హెపటైటిస్‌ బి, సి వ్యాధిగ్రస్తులకు ఖరీదైన మందులతో పాటు ఇమ్యునోగ్లోబ్లిన్స్‌ను సైతం ఉచితంగా అందజేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్‌ వెంకటరంగారెడ్డి, డాక్టర్‌ మోహన్‌రెడ్డి, పీజీలు

పెద్దాసుపత్రిలో ఉచితంగా మందులు

హెపటైటిస్‌–బీ, సీ వైరస్‌లతో బాధపడే వారికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఉచితంగా మందులు ఇస్తున్నారు. నేషనల్‌ వైరల్‌ హెపటైటిస్‌ కంట్రోల్‌ ప్రోగ్రామ్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2020 డిసెంబర్‌ 21 నుంచి ఈ మందులను రోగులకు ఉచితంగా అందజేస్తున్నాయి. బి వైరస్‌ వారు మందులు ప్రైవేటుగా కొనాలంటే నెలకు రూ.1,400ల చొప్పున ఏడాదికి రూ.16,800లు, సి వైరస్‌ వారికి నెలకు రూ.15 వేల చొప్పున మూడు నెలల పాటు రూ.45 వేలు ఖర్చవుతుంది. ఇంత ఖరీదు చేసే మందులన్నీ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగానే ఇస్తున్నారు. వ్యాధి పూర్తిగా తగ్గాలంటే వైద్యుల సూచన మేరకు కోర్సు వాడాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు హెపటైటిస్‌ సి వైరస్‌ ఉన్న వారికి 430 మందికి, బీ వైరస్‌ వారికి 715 మందికి ఇక్కడ మందులు ఇచ్చారు. ఈ మందులు మధ్యలో ఆపేస్తే అది కాలేయం ఫెయిల్యూర్‌ అయి లివర్‌ సిరోసిస్‌కు దారి తీస్తుంది.

గర్భిణులు హెపటైటిస్‌-బి పరీక్ష చేయించుకోవాలి



గర్భిణులకు హెచ్‌ఐవీతో పాటు హెపటైటిస్‌–బి పరీక్ష చేయిస్తాం. ఇది రక్తం ఎక్కించడం ద్వారా లేదా శృంగారం వల్ల ఈ వైరస్‌ వ్యాప్తి చెందవచ్చు. గర్భిణికి హెపటైటిస్‌–బి ఉంటే ప్రసవం తర్వాత బిడ్డకు కూడా వచ్చే అవకాశం ఉంది. అందుకే ప్రసవం అయిన వెంటనే అప్పటికే తల్లికి హెపటైటిస్‌–బి ఉంటే హెపటైటిస్‌ వ్యాక్సిన్‌తో పాటు ఇమ్యునోగ్లోబిన్స్‌ ఇస్తాం. తల్లికి వైరస్‌ లేకపోతే శిశువుకు కేవలం హెపటైటిస్‌–బి వ్యాక్సిన్‌ మాత్రమే సరిపోతుంది. కొన్నిసార్లు గర్భిణులకు హెపటైటిస్‌–ఏ వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల లివర్‌ ఫెయిల్యూర్‌ కావచ్చు. కానీ ఇది చాలా అరుదుగా సంభవిస్తుంది.

– డాక్టర్‌ జ్యోత్స్న, గైనకాలజిస్టు, కర్నూలు

ఇంట్లోనే వండుకుని తినాలి



హెపటైటిస్‌ వ్యాధులు రాకుండా ఉండాలంటే ఇళ్లలోనే ఆహారం వండుకుని తినాలి. ఫ్రైలు తగ్గించుకుని ఉడికించిన వంటలు ఎక్కువగా తీసుకోవాలి. ఆకు కూరలు బాగా తినాలి. వాటిలో కొవ్వు పెద్దగా ఉండదు. రోజూ అన్నంతో పాటు గింజలు, పప్పుధాన్యాలు తీసుకోవాలి. పండ్లలో సహజమైన కొవ్వును కరిగించే పోషకాలుంటాయి. కాబట్టి సీజన్‌ వారీగా వచ్చే పండ్లను తినాలి.

– డాక్టర్‌ నవీన్‌కుమార్‌, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

'నవోదయ' క్లస్టర్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



బ్యాడ్మింటన్‌ పోటీలను ప్రారంభిస్తున్న రూరల్‌ సీఐ మోహన్‌రెడ్డి



టేబుల్‌ టెన్నిస్‌లో పోటీ పడుతున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరురూరల్‌: బనవాసి జవహర్‌ నవోదయ విద్యాలయంలో రెండు రోజులు పాటు జరిగే 34వ క్లస్టర్‌ స్పోర్ట్స్‌ మీట్‌ బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. విద్యాలయ ఇన్‌చార్జ్‌ ప్రిన్సిపాల్‌ చందిరన్‌ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలను కేంద్రీయ విద్యాలయ అసిస్టెంట్‌ కమిషనర్‌ సీహెచ్‌. ప్రసాద్‌రావు, రూరల్‌ సీఐ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవోదయ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలన్నారు. విద్యార్థులు చిన్న విషయాలకు కుంగిపోకుండా మానసికంగా స్థిరత్వం ఏర్పరుచుకోవాలన్నారు. క్లస్టర్‌ మీట్‌లో కబడ్డీ, ఖో–ఖో, టేబుల్‌ టెన్నిస్‌, షటిల్‌ బ్యాడ్మింటన్‌, చెస్‌, యోగా పోటీలను నిర్వహించారు. పోటీలకు బనవాసి, కడప, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం -1, ప్రకాశం-2, కరేకల్‌, పుదుచ్చేరిలకు నుంచి నవోదయ విద్యార్థులు 312 మంది హాజరయ్యారు. ప్రారంభ వేడుకల్లో ఇన్‌చార్జ్‌ వైస్‌ ప్రిన్సిపాల్‌ బసవరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర వాహనాల దొంగ అరెస్టు

కర్నూలు: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆటోలు, ద్విచక్ర వాహనాలు చోరీ చేసి తప్పించుకుతిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగ ఆట కట్టించారు రెండోపట్టణ పోలీసులు. నెల రోజుల వ్యవధిలో ఆటోలు, ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో కేసు నమోదు చేసుకుని సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు గోపీనాథ్‌, ఎం.ఎ.ఖాన్‌ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు గ్రామానికి చెందని బుడగజంగాల రాయుడు సుంకేసుల రోడ్డులోని క్రిస్టియన్‌ శ్మశాన వాటిక ఎదురుగా ఉన్న రోడ్డు పక్కన గల మోరి వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా అతని నేరాల చిట్టా బయటపడింది. అతని వద్ద నుంచి సుమారు రూ.5.80 లక్షలు విలువ చేసే రెండు ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను సీజ్‌ చేశారు. ఇతనిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు కేసులు నమోదై ఉన్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. జల్సాలకు అలవాటు పడి వాహనాలను చోరీ చేసేవాడని సీఐ వెల్లడించారు. డబ్బులు అయిపోగానే మళ్లీ దొంగతనం చేయడం అలవాటుగా చేసుకున్నాడని తెలిపారు. వాహనాలు రికవరీ చేసి దొంగను అరెస్టు చేయడంలో నైపుణ్యత ప్రదర్శించిన ఏఎస్‌ఐ గోస్‌పీర్‌, హెడ్‌ కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, ఎ.వి.రావు, పీసీలు మల్లికార్జున, రవికుమార్‌ యాదవ్‌, మహేంద్రుడు, శ్రీనివాసులు, తదితరులను సీఐ అభినందించారు.

సాయం.. నిలబెట్టిన ప్రాణం

- సాక్షి కథనానికి స్పందించిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- సీఎం సహాయ నిధి రూ.12లక్షలతో చిన్నారికి ఆపరేషన్‌

పత్తికొండ రూరల్‌: మృత్యువుతో పోరాడుతున్న బాలుడికి సీఎం సహాయ నిధి నుంచి అందిన సాయం ప్రాణం పోసింది. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవతో ఖరీదైన ఆపరేషన్‌ పూర్తి చేసుకుని ఆ బాలుడు క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. పత్తికొండ మండలం చందోలి గ్రామానికి చెందిన జశ్వంత్‌ ఏడాది వయసులోనే తల్లి వెంకటలక్ష్మిని కోల్పోయాడు. రెక్కాడితే కానీ డొక్కాడని తండ్రి లక్ష్మన్న బాలుడిని కంటికి రెప్పలా చూసుకుంటూ వచ్చాడు. అయితే ప్రాణాంతకమైన అప్లాస్టిక్‌ అనీమియా సోకడంతో జశ్వంత్‌ రోజురోజుకు నిస్సత్తువతో నీరసించిపోతున్నాడు. మృత్యువుతో పోరాడుతున్న బాలుడి దీనగాథపై సాక్షి దినపత్రికలో ఫిబ్రవరి 22న 'చిన్నోడికి పెద్ద కష్టం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పందించి, వైద్యాధికారులతో మాట్లాడారు. బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌ చేయాలని తెలుసుకుని.. జశ్వంత్‌ కుటుంబ దయనీయ స్థితిని సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం.. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆపరేషన్‌కు రూ.12లక్షలు కేటాయించారు. దీంతో హైదరాబాద్‌లోని అమెరికన్‌ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో ఆపరేషన్‌ విజయవంతమై జశ్వంత్‌ ప్రాణాలతో బయటపడ్డాడు. హాస్పిటల్‌ నుంచి డిశ్చార్జ్‌ అయిన జశ్వంత్‌, కుటుంబ సభ్యులు గురువారం పత్తికొండలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని చెప్పారు.



సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం



జశ్వంత్‌కు కేక్‌ తినిపిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

శ్రీకాళహస్తి ఘటనపై హెచ్ఆర్‌సీకి నివేదిక

కర్నూలు(సెంట్రల్‌): ఇటీవల శ్రీకాళహస్తిలో ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న వ్యక్తులపై పోలీసులు చేయి చేసుకున్నారన్న ఘటనపై విచారణ నివేదికను బుధవారం తిరుపతి డీఎస్పీ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌(హెచ్‌ఆర్‌సీ)కు నివేదించారు. సాయి అనే వ్యక్తిపై శ్రీకాళహస్తి సీఐ అంజు యాదవ్‌ చేయిచేసుకున్నారని మీడియాలో వచ్చిన కథనాలను హెచ్‌ఆర్‌సీ సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. శ్రీకాళహస్తి పోలీసు స్టేషన్‌ సీఐ అంజుయాదవ్‌, స్టేషన్‌ ఆఫీసర్‌, తిరుపతి డీఎస్పీ, తిరుపతి ఎస్పీ, అనంతపురం రేంజ్‌ డీఐజీ, తిరుపతి కలెక్టర్‌, డీజీపీ, హోంసెక్రటరీ, చీఫ్‌ సెక్రటరీలకు నోటీసులు జారీ చేసింది. ఈఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి జూలై 27న నివేదిక సమర్పించాలని సీఐ, డీఎస్పీ, ఎస్పీలను ఆదేశించింది. ఈ క్రమంలో విచారణకు సంబంధిచిన నివేదికను సమర్పించడంతో హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌ ఎం.సీతారామమూర్తి కేసును వాయిదా వేసినట్లు కమిషన్‌ విభాగాధికారి బొగ్గరం తారక నరసింహకుమార్‌ తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో మిల్లెట్ కేఫ్ ప్రారంభం

కర్నూలు(అగ్రికల్చర్‌): కలెక్టరేట్‌ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మిల్లెట్‌ కేఫ్‌ను జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ జి.సృజన శుక్రవారం ప్రారంభించనున్నారని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్‌ వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రాజ్‌విహార్‌): విద్యుత్‌ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యుత్‌ ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌ గణేష్‌ డిమాండ్‌ చేశారు. గురువారం జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్‌ భవన్‌లో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. విద్యుత్‌ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో దశలవారిగా ఆందోళనలు చేస్తామని గణేష్‌ హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్‌ లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యదర్శి రంగస్వామి, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. అలాగే ఆర్‌ఎస్‌ రోడ్డు వద్ద ఉన్న పవర్‌ హౌస్‌ ఎదుట డివిజన్‌ ఉద్యోగులు నిరసన తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు(హాస్పిటల్‌): కాలు జారి కింద పడి తలకు తీవ్ర గాయమైన ఓ వ్యక్తి పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన పింజరి మహబూబ్‌బాషా(38) బుధవారం రాత్రి ఇంట్లో కింద పడటంతో తలకు గాయమైంది. కుటుంబ సభ్యులు అతన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి డాక్టర్ల సూచనలతో గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కర్నూలు పెద్దాస్పత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో క్యాజువాలిటీలో వెంటిలేటర్‌పై ఉంచి వైద్యులు చికిత్స ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కదలిక లేకపోవడంతో అక్కడే ఉన్న కొందరు సిబ్బంది చనిపోయారని భావించారు. వెంటనే సీపీఆర్‌ చేయడంతో పల్స్‌లో కాస్త కదలిక వచ్చింది. ఈ విషయమై చనిపోయిన వ్యక్తి మళ్లీ బతికాడని కొందరు హడావుడి చేశారు. కొన్ని టీవీ చానళ్లలోనూ స్క్రోలింగ్‌ వేశారు. మరోవైపు వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఏఎంసీలోని ఎస్‌ఐసీయూకు తరలించారు. అక్కడ కోలుకోలేక మధ్యాహ్నం 2.55 గంటలకు మృతిచెందడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం

కర్నూలు కల్చరల్‌: కేంద్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రమౌళి అన్నారు. ప్రధానమంత్రి కిసాన్‌ సమృద్ధి కేంద్రాన్ని గురువారం ప్రధాని మోదీ రాజస్తాన్‌లో ప్రారంభించారు. మోదీ ప్రత్యక్ష ప్రసంగాన్ని అగ్రికల్చర్‌ ఆఫీసర్లు, రైతులుతో కలిసి పవులువురు బీజేపీ నాయకులు వీక్షించారు.

8వ తరగతి నుంచి ఏఐ సబ్జెక్టు



మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

కర్నూలు సిటీ: కేంద్రీయ విద్యాలయాల్లో 8వ తరగతి నుంచి ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌ సబ్జెక్టును ప్రవేశపెట్టారని డీఈఓ రంగారెడ్డి, ఎన్‌ఈపీ కో–ఆర్డినేటర్‌, హైదరాబాద్‌ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్‌ ఇబ్రాయల్‌ తెలిపారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్‌ ఇబ్రాయల్‌ మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్య విధానం అమలులోకి వచ్చి మూడేళ్లవుతున్న సందర్భంగా ఈ నెల 29, 30 తేదీల్లో ఢిల్లీలో వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. గతంలో విద్య విధానం 10+2+3 ప్రకారం ఉండేదని, నూతన విధానం ప్రకారం ప్రస్తుతం 5+3+3+4 అమలవుతోందన్నారు. దేశ వ్యాప్తంగా 1,250, నేపాల్‌, ఇరాన్‌, రష్యా వంటి దేశాల్లో ఒకటి చొప్పున మొత్తం 1,253 కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయని తెలిపారు. రాయలసీమ జిల్లాల్లో కొత్తగా తిరుపతి, డోన్‌, అనంతపురంలో మూడు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు అయ్యాయని, త్వరలోనే నిర్మాణ పనులు మొదలు కానున్నాయన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌ అని డీఈఓ రంగారెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా హైస్కూల్‌ తరగతి గదుల్లో ఇంటారాక్టివ్‌ ఫ్లాట్‌ ప్యానెల్స్‌, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్‌ టీవీలు ఏర్పాటు చేశారన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ పుస్తకాలను అందిస్తున్నారని, అటల్‌ టింకరింగ్‌ ల్యాబ్‌లు, టోఫెల్‌, బైజూస్‌ కంటెంట్‌ను పిల్లలకు అందిస్తున్నారన్నారు. 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చారని, 2025 మార్చిలో 10వ తరగతి పిల్లలు సీబీఎస్‌ఈ సిలబస్‌తోనే పరీక్షలు రాయనున్నారన్నారు. విలేకరుల సమావేశంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్‌ అంజనేయులు, కల్లూరు ఎంఈఓ–2 వనజాకుమారి, ఇండస్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ శ్రీనివాసరెడ్డి, రిడ్జ్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ రాజేంద్రన్‌ తదితరులు పాల్గొన్నారు.

భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందని..

కర్నూలు(హాస్పిటల్‌): తన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందనే మనోవేదనతో ఓ వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కర్నూలులోని మహాలక్ష్మినగర్‌కు చెందిన దస్తగిరిరెడ్డి రాయలసీమ యూనివర్సిటీలో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య వరలక్ష్మి భర్తతో గొడవపడి ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన దస్తగిరిరెడ్డి గురువారం రాత్రి ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పుణ్య ప్రదమైంది ఉమ్రా యాత్ర

కర్నూలు(రాజ్‌విహార్‌): ఉమ్రా యాత్ర ఎంతో పుణ్యప్రదమైందని ముఫ్తి, హాజీ అబ్దుర్‌ రహిమాన్‌ అన్నారు. గురువారం ఓ ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాలులో అల్‌ ఫరా ఉమ్రా గ్రూప్‌ ఆధ్వర్యంలో ఉమ్రా యాత్రికులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. మక్కా, మదీనా ప్రాంతాల్లో ఉమ్రా కోసం పాటించాల్సిన పద్ధతులు, చేయాల్సిన ప్రార్థనలు వివరించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్‌ అబ్దుల్లా, డైరెక్టర్‌ జావిద్‌, హజ్‌ సొసైటీ ప్రతినిధులు పాషా, అహ్మద్‌, డీఎస్పీ మహబూబ్‌ బాషా తదితరులు పాల్గొన్నారు.